ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

ధాన్యం కొనుగోళ్ల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిన్నారం, నవంబర్ 21: ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మండల కేంద్రం జిన్నారంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. ధాన్యం మ్యాచర్‌లో వేసి తేమను పరిశీలించారు. గన్నీ బ్యాగుల వివరాలు, కొనుగోలు కేంద్రానికి ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు రాత్రిపూట అడవి పందులు వస్తున్నాయని, చుట్టూ జాలి ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం జిన్నారంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని ఎన్యూమరేట్లకు సూచించారు.

వెంచర్ వేస్తున్న రోడ్డు నిర్మాణాన్ని ఆపాలి

జిన్నారంలోని సర్వే నంబర్ 1లో మూడేండ్ల క్రితం ఎకరాకు ఆరు వందల గజాల స్థలం ఇస్తామని రైతుల నుంచి భూములు తీసుకున్నారని, ఇప్పటివరకు ఇవ్వలేదని రైతు విఠల్ కలెక్టర్‌కు తెలిపారు. తీసుకున్న భూములైనా ఇవ్వాలని, ఇస్తామన్నా ఆరు వందల గజాల ఇచ్చేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన ఆమె రైతులకు న్యాయం జరిగేలా చేస్తానన్నారు. సర్వే నంబర్ 1002లోని ప్రభుత్వ భూమిలో నుంచి ఓ ప్రైవేటు వెంచర్ వంద ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేస్తున్నదని, దీనిపై తహసీల్దార్, ఎంపీడీవో, ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా పనులు ఆపడం లేదని కలెక్టర్‌కు జిన్నారం గ్రామస్తులు తీసుకొచ్చారు. దీనిపై ప్రశ్నిస్తే పోలీసులు బెదిరిస్తున్నారని చెప్పారు. రోడ్డు పనులు ఆపాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో అరుణ, ఏపీడీ జంగారెడ్డి, డీపీఎం జయశ్రీ, ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, ఎంపీవో రాజ్‌కుమార్, సర్వేయార్ రామభద్ర, ఐకేపీ నరేందర్, సీసీ సుజాత, వీవోఏ లత పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలి

గుమ్మడిదల, నవంబర్ 21: కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంబురాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతు బీమా, మహాలక్ష్మీ, కల్యాణలక్ష్మిలో తులం బంగారం, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ ఫథకాలు అమలు చేయలేని అసమర్థ కాంగ్రెస్ విజయోత్సవ సంబురాలు చేసుకోవడం విడ్డురంగా ఉందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటుతో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

నశీర్(ఫైల్)

ఝరాసంగం, నవంబర్ 21: అడవి పందుల భారీ నుంచి పంటను రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఝరాసంగం మండల పరిధిలోని చిలేమామిడి, జీర్లపల్లి గ్రామాల శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలేమామిడి గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు ఆలుగడ్డ పంటను అడవి పందుల భారీ నుంచి రక్షించుకోవడానికి పొలం చుట్టూ జియో వైర్‌ను ఏర్పాటు చేసి దానికి విద్యుత్ తీగతో కరెంట్ వచ్చేటట్లు చేశాడు. దేవరంపల్లి గ్రామానికి చెందిన ఎండీ నశీర్(49) బుధవారం సాయంత్రం నీళ్లు తాగడానికి వెళ్తుండగా కరెంట్ ఉన్న జియో వైర్ తగలడంతో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు అఫ్రోజ్ ఫిర్యాదుతో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంత్, ఎస్ఐ నరేశ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాలు ఒరిగినా పట్టించుకోరా?

వేలాడుతున్న తీగలను చూపుతున్న రమేశ్

కంగ్టి, నవంబర్ 21: కంగ్టి నుంచి తడ్కల్ వెళ్లే దారిలో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారి నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం కంగ్టి మండల బాధ్యుడు రమేశ్ అన్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను గుర్తించి ఒరిగి స్తంభాలను సరి చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, నవంబర్ 21: ఆర్సీపురంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతమ్మ గురువారం ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్‌నగర్‌కాలనీ, సండే మార్కెట్, సంగీత టాకీస్, బొంబాయి కాలనీ, ఈఎస్ఐ దవాఖాన ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఆర్ఆర్‌నగర్, నాగులమ్మ ఆలయం, స్నేహ అపార్ట్‌మెంట్స్, ఓల్డ్ ఆర్సీపురం, బీడీఎల్ కాలనీలో మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

మొగుడంపల్లి ఏఓగా హస్మోద్దీన్

జహీరాబాద్, నవంబర్ 21: నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల వ్యవసాయాధికారిగా హస్మోద్దీన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వినోద్‌కుమార్ జహీరాబాద్ ఏడీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అయన స్థానంలో మండల వ్యవసాయాధికారిగా హస్మోద్దీన్‌ను నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. ఈ మేరకు హస్మోద్దీన్‌కు ఏఈవో స్వాగతం పలికారు. పంటలకు సోకే తెగుళ్లు, చీడపురుగుల నివారణకు చర్యలు, పంటల దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహా, సూచనలు తెలియజేసి రైతులకు అందుబాటులో ఉంటానాని పేర్కొన్నారు.

అట్టహాసంగా బాల వైజ్ఞానిక ప్రదర్శన

విద్యార్థుల ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 21: విద్యార్థులు ఇష్టపడి చదవుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం స్థానిక సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని రేకెత్తిస్తాయని పేర్కొన్నారు. సైన్స్, గణిత విషయాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. పుస్తకాలను చదవడం, రాయడం మాత్రమే కాకుండా అందులోని విషయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు వినూత్న తరహాలో రూపొందించిన వివిధ ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. ఎగ్జిబిట్ల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, సెయింట్ ఆంథోనీఎస్ పాఠశాల కరెస్పాండెంట్ సలోమాన్‌రెడ్డి, మండల విద్యాధికారి విద్యాసాగర్, వివిధ కమిటీల కన్వీనర్లు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఖాసీం

కోహీర్, నవంబర్ 21: మండలంలోని దిగ్వాల్ గ్రామానికి చెందిన బంధువుల ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సతీశ్ గురువారం వెల్లడించారు. సంగారెడ్డి పట్టణంలోని రిక్షా కాలనీలో నివాసం ఉండే ఖాసీం(42) కనిపించకుండా పోయాడన్నారు. బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా జాడ తెలియలేదన్నారు. ఎవరికైనా అతడి ఆచూకీ తెలిస్తే కోహీర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి

వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

కల్హేర్, నవంబర్ 21: అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.6 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కొత్త పెంఛన్‌ను వెంటనే మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షుడు సీటి సాయిలు, ఉపాధ్యక్షుడు మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సంగ్రామ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి పెరిగిన పెన్షన్‌ను అందజేస్తామని హామీ ఇచ్చి 11 నెలలు గడిచిపోయిందన్నారు. దివ్యాంగుల సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

ముదిరాజ్ సంఘం జెండావిష్కరణలో సంఘం నాయకులు

పుల్కల్, నవంబర్ 21: ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని మిన్పూర్ గ్రామంలో ముదిరాజులు మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కొండ గారి నర్సింహులు ముదిరాజ్ జెండా ఆవిష్కరించారు. ముదిరాజ్ యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ముదిరాజులను బీసీ(డి) నుంచి బీసీ(ఎ)లోకి మార్చాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు రాయితీపై వలలు, ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీల్స్ వాహనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో అంతంగారి లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ దిగోల దుర్గయ్య, మాజీ ఉప సర్పంచ్ మాణెమ్మాశ్రీశైలం, బోయిని భిక్షపతి ముదిరాజ్, భగవంత్ ముదిరాజ్, సాయికుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్

జహీరాబాద్, నవంబర్ 21: జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం దవాఖానలో సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి, కనీస వేతనాన్ని రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గౌస్, దవాఖాన సీఐటీయూ యూనియన్ అధ్యక్షుడు బండి సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఏలిషా, నాయకులు అఖిల్, సుమలత, పవన్, కృష్ణ, వసీం, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ గుర్తు తెలియని వ్యక్తి హత్య

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, పట్టణ సీఐ శివలింగం

జహీరాబాద్, నవంబర్ 21: జహీరాబాద్ పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా సమీపంలోని హిందూ శ్మశానవాటికకు వెళ్లే దారిలో రైల్వే లైను దగ్గర గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కట్టెలతో దాడిచేసి బండారాయితో బలంగా కొట్టి హత్య చేశారు. మృతుడి వయస్సు 35-40 మధ్యలో ఉంటుంది. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పట్టణ సీఐ శివలింగం, జహీరాబాద్ రూరల్ సీఐ ప్రభాకర్ రావు సిబ్బందితో ఘటనా స్థలాన్ని సందర్శించారు. డాగ్‌స్క్వైడ్‌ను రప్పించి హత్యకు పాల్పడిన పరిసరాల్లో గాలింపు చేపట్టినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. మృతదేహాన్ని పోర్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా పద్మశాలి సంఘం వన భోజనాలు

కార్తిక మాస వన భోజనాల్లో పద్మశాలీలు

రామచంద్రాపురం, నవంబర్ 21: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో పద్మశాలి సేవా సంఘం కార్యాలయం ఆవరణంలో గురువారం కార్తిక మాస పద్మశాలి సంఘం వనభోజనాలను ఏర్పాటు చేశారు. పద్మశాలి సేవా సంఘం ఆర్సీపురం అధ్యక్షుడు జక్కమల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజనాలకు పద్మశాలీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జక్క మల్లేశ్ మాట్లాడుతూ ఆర్సీపురంలో నూతనంగా పద్మశాలి సేవా సంఘం ఏర్పాటైందని, మొదటిసారి కార్తిక వనభోజనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది కార్తిక మాస వన భోజనాలను ఏర్పాటు చేసి పద్మశాలి సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సురేందర్, పెంటయ్య, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, మురళి, సంయుక్త కార్యదర్శులు రాజశేఖర్, రాములు, ఉప ప్రధాన కార్యదర్శి భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్లు శివకుమార్, మహేందర్, కోశాధికారి రవికుమార్, కార్యనిర్వహణ కార్యదర్శులు రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మినా, కొన్నా జైలుకే..

వివరాలు వెల్లడిస్తున్న కొండాపూర్ సీఐ వెంకటేశ్

మునిపల్లి, నవంబర్ 21: గుట్టుచప్పుడు కాకుండా బీదర్ నుంచి హైదరాబాద్ వైపు కారులో తరలిస్తున్న 500 గ్రాముల ఎండు గాంజాయి, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకొని గంజాయి తరలిస్తున్న వారిని రిమాండ్‌కు తరలించినట్లు కొండాపూర్ సీఐ వెంకటేశ్ తెలిపారు. గురువారం మండలంలోని బుధేరా పోలీస్‌స్టేషన్లో వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఎండు గంజాయి తరలిస్తున్న వారిని గుర్తించి అదుపుతోకి తిసుకోని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ భాగస్వామ్యంపై అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

జహీరాబాద్, నవంబర్ 21: జహీరాబాద్ మండలంలోని హుగ్గేల్లి గ్రామంలో డీడీఎస్-కేవీకే కేంద్రం శాస్త్రవేత్తలు, మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు కలిసి గ్రామీణ భాగస్వామ్య అంచనాపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో సామాజిక సంస్థలు, వనరులు, నేల రకాలు, పంట పొలాలు, పశువులు, వివిధ సమస్యలపై నేలపై చిత్రపటాల ప్రదర్శనతోపాటు చార్టుల ద్వారా వాటి అవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కైలాష్, సాయి ప్రియాంక, ఏఈవో ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహం సామాజిక దురాచారం

మాట్లాడుతున్న జిల్లా అధికారి లలితకుమారి

ఝరాసంగం, నవంబర్ 21: బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అదొక సామాజిక దురాచారమని మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బాలికల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలను వేధించినా, అక్రమ రవాణా చేసినా హెల్ప్ లైన్ నంబర్లు 181, 1098 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో అంజమ్మ, డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్టు యాదగిరి, విశాల, సూపర్‌వైజర్లు అనితకుమారి, రాధమ్మ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ

గుమ్మడిదల: బొంతపల్లిలో అయ్యప్ప మహాపడి పూజలో స్వాములు

జిన్నారం, నవంబర్ 21: ఖాజీపల్లి గ్రామంలో గురువారం అయ్యప్ప పడి పూజ ఘనంగా జరిగింది. మాలధారణ చేపట్టిన మాజీ ఎంపీటీసీ ఆకుల భార్గవ్ అయ్యప్ప పడి పూజను నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన మహా పడిపూజకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది.

బొంతపల్లిలో..

గుమ్మడిదల, నవంబర్ 21: మండలంలోని బొంతపల్లిలో అయ్యప్ప మహాపడి పూజను కనుల పండువగా నిర్వహించారు. గురువారం బొంతపల్లిలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి నవీనా దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో అయ్యప్పస్వామి మండల దీక్ష చేస్తున్న భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భజనమండలి భక్తులచే నిర్వహించిన భజన పాటలు అలరించాయి. మహా పడిపూజను గురుస్వామి నాగభూషణం గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కల్యాణరామచంద్రస్వామి ఆలయంలో పూజలు

గుమ్మడిదల, నవంబర్ 21: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని కల్యాణ రామచంద్రస్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా గురువారం ఆలయ కమిటీ ధర్మకర్తలు వేద మంత్రోచ్చరణల మధ్య ప్రధాన కడపను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేఉశారు. మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ధర్మకర్తలు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణ, ధర్మారెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



శివరాజ్‌పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీవాసులు

'డబుల్' సమస్యలు పరిష్కరించాలి

సదాశివపేట, నవంబర్ 21: సిద్దాపూర్ సమీపంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్‌కు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. మిషన్ భగీరథ నీరు సరిగా రావడంలేదని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీ రోడ్లు పరిశుభ్రంగా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. డబుల్ బెడ్రూం కాలనీకి శ్మశానవాటిక నిర్మించాలని విన్నవించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్ మాట్లాడుతూ త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు కుమార్‌స్వామి, నగేశ్, నందు, రాజయ్య, రవి, శివ, రాజు, బస్వరాజ్, సూరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సుక్కల్ తీర్థ్ చెరువు పనులు ప్రారంభం

చెరువు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈ ధర్మ, అధికారులు

కంగ్టి, నవంబర్ 21: త్వరలోనే సుక్కల్ తీర్థ్ చెరువు పనులను ప్రారంభించనున్నట్లు చీఫ్ ఇంజినీర్ ధర్మ అన్నారు. గురువారం కంగ్టి మండలంలోని సుక్కల్‌తీర్థ్ శివారులో నూతనంగా మంజూరైన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలం నుంచి పనులు ఎందుకు ప్రారంభించలేదని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు ప్రాంత రైతులకు పరిహారం అందరికీ అందిందని పేర్కొన్నారు. త్వరలోనే చెరువు పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ చెరువు ఏర్పాటుతో చుట్టు పక్కల 200 ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ ఏసప్ప, ఈఈ సురేందర్, డీఈ విజయ్‌భాస్కర్, ఏఈ రవి ఉన్నారు.

కార్మికుల ఐక్యతతో మెరుగైన వేతన ఒప్పందం

వేతన ఒప్పంద పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్ రెడ్డి

బొల్లారం, నవంబర్ 21: కార్మికులు ఐక్యతతోనే మెరుగైన వేతన ఒప్పందం జరుగుతుందని రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓస్లోహ్ కోగిఫర్ టర్న అవుట్ పరిశ్రమ కార్మికులకు రూ.11,900 మెరుగైన వేతన ఒప్పందాన్ని చేశారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్ రెడ్డి సమక్షంలో పరిశ్రమ కార్మికులకు వేతన ఒప్పందపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల ఐక్యతతోనే మెరుగైన ఒప్పందం చేయడానికి వీలైందన్నారు. కార్మికులకు అండగా నిలిచిన అధికారులకు ధన్యవాదాలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పద్మా గౌడ్, ముత్యాలరావు, సంతోష్, రంజన్, మల్లి, పీకే సింగ్, శ్రీనివాస్, సందీప్ పాత్రో పాల్గొన్నారు.

దొంగ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఊరేళ్ల రాజేందర్, నిందితుడు

రామచంద్రాపురం, నవంబర్ 21: ఓ మహిళలకు చెందిన ప్లాట్‌ను వేరే మహిళను చూపించి ఫేక్ రిజిస్ట్రేషన్ చేయించిన వ్యక్తిని కొల్లూర్ పోలీసులు పట్టుకొని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్సీపురానికి చెందిన శశికళ అగర్వాల్ 1985లో తెల్లాపూర్‌లోని ఏబ్లాక్‌లో నారాయణరావు లేఅవుట్‌లో ప్లాట్ తీసుకుంది. అప్పటినుంచి ఆమె అప్పుడప్పుడు ఆ ప్లాట్ వద్దకు వెళ్లి చూసుకునేది. కానీ, అక్కడ ఎలాంటి కన్‌స్ట్రక్షన్ చేయకపోవడంతో ఓపెన్ ప్లాట్‌గా ఉండేది. 2003లో ఆర్సీపురానికి చెందిన ఊరేళ్ల రాజేందర్ శశికళఅగర్వాల్ స్థానంలో వేరే మహిళను పెట్టి ఆ ప్లాట్‌ని రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆ తర్వాత తొమ్మిది రోజులకు ఆర్సీపురానికి చెందిన ఉషారాణికి రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తర్వాత శేరిలింగంపల్లికి చెందిన కోటేశ్వరమ్మకు 2006లో రిజిస్ట్రేషన్ చేశారు. అదే సంవత్సరం ఆమె తెల్లాపూర్‌కి చెందిన భుజంగరెడ్డికి ఆ ప్లాంట్‌ని రిజిస్ట్రేషన్ చేసింది. ఆ తర్వాత 2022లో అసలు ప్లాట్ ఓనర్ శశికళఅగర్వాల్ ప్లాట్ విషయం తెలుసుకొని భుజంగరెడ్డిని కలిసి ఆ ప్లాటు తమదని చెప్పడంతో ఈ ప్లాట్‌కు ఇప్పటికే రెండు డాక్యుమెంట్లు ఉన్నాయని, అవి చూసి తాను కోనుగోలు చేశానని ఆమెకు చెప్పాడు. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. 2023లో ఆప్లాట్‌ని శశికళఅగర్వాల్ దగ్గర రాజు అనే వ్యక్తి కొనుగోలు చేసి భుజంగరెడ్డితో ప్లాట్ తనదని వారించాడు. దీంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడ